పాత దేవతా చిత్ర పటాలు, పుస్తకాల సేకరణకు డ్రైవ్

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న తులసి

ఖైరతాబాద్, ఆగస్టు 9: పాత దేవతా చిత్రపటాలు, పుస్తకాల సేకరణకు ప్రత్యేక డ్రైవ్‌ను చేపడుతున్నట్లు ఆర్య వైశ్య కమ్యూనిటీ ఇంటర్నేషనల్ ప్రతినిధి తులసీ సరాఫ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గృహాల్లో వినియోగంలో లేని, పాతపడి చిరిగిపోయిన దేవతా పటాలు, వివిధ రకాల ఆధ్యాత్మిక పుస్తకాలు కొందరు నిర్లక్ష్యంగా బయట చెత్తకుప్పల్లో పడేస్తుంటారని, అది సరైంది కాదన్నారు. వాటిని సేకరించి పురోహితుల ద్వారా ఉద్వాసన పూజ చేయించి అనంతరం పారే నదిలో వేస్తామని, ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఈ నెల 11 నుంచి సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. రీయూజ్, రెడ్యూస్, రికవరీ, రీసైకిల్ తదితర నాలుగు విధానాలతో వాటిని సేకరించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని, పగలని గ్లాసు, పటం ఫ్రేమ్‌లను తిరిగి వాడుకునేలా రూపొందిస్తామని, కాగితంతో చేసిన చిత్రపటాలు, పుస్తకాలను పేపర్ కర్మాగారాలకు రీసైకిల్ కోసం అందజేస్తామన్నారు.

టీ హబ్‌తో తమిళ నాడు ఇంజినీరింగ్ కళాశాల ఒప్పందం

సిటీబ్యూరో, ఆగస్టు 9(నమస్తే తెలంగాణ): విద్యా సంస్థల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు తమిళనాడుకు చెందిన పీఎస్ఎన్ఏ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థ టీ హబ్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. టీ హబ్ సీఈఓ ఎంఎస్ రావుతో పాటు ప్రతినిధుల బృందం తమిళనాడులోని కళాశాలను అక్కడి మేనేజ్‌మెంట్‌తో పాటు విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యార్థుల్లో కళాశాల స్థాయిలోనే అంతప్రెన్యూర్‌షిప్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు సొంతంగా ఆవిష్కరణలు చేసేలా కళాశాలతో కలిసి పనిచేస్తామని టీ హబ్ సీఈఓ ఎంఎస్ రావు తెలిపారు. ఒప్పందం వల్ల వేలాది మంది విద్యార్థులతో టీ హబ్ కలిసి పని చేసేందుకు అవకాశం ఉందన్నారు.

ఓయూ ఇంగ్లిష్ విభాగంలో ఆస్ట్రేలియా బృందం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 9: ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని ఇంగ్లిష్ విభాగాన్ని ఆస్ట్రేలియన్ కాన్సుల్ జనరల్ ఆంధ్రా కొలిస్టర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను విభాగంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణతో సమావేశమయ్యారు. యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియాతో ఓయూకు ఉన్న అవగాహన ఒప్పందంలో భాగంగా వర్సిటీకి వచ్చినట్లు ఆంధ్రా తెలిపారు. ఆ తరువాత అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లిష్ విభాగం హెడ్ ప్రొ.విజయ, ప్రొ.పరిమళ కులకర్ణి, ప్రొ.మురళీకృష్ణ, డా.అశోక్, ప్రొ.సవిన్, ప్రొ.సయీదా తలత్ సుల్తానా, డా.క్రిస్టోఫర్, డా.బాలునాయక్ పాల్గొన్నారు.

తాను మరణిస్తూ.. ఏడుగురి జీవితాల్లో వెలుగులు

శ్రీకాంత్(ఫైల్)

మన్సూరాబాద్/ఖైరతాబాద్, ఆగస్టు 9: పుట్టెడు దుఃఖంలో ఉండి సైతం మరి కొందరికి ప్రాణం పోసేందుకు ఓ కుటుంబం ముందుకు వచ్చింది. బ్రెయిన్ డెడ్ అయిన తమ కుటుంబ సభ్యుడి అవయవాలను దానం చేసి ఏడుగురి జీవితాల్లో వెలుగులు నింపారు. ఆదిలాబా ద్ జిల్లా, షెట్‌పల్లికి చెందిన రేవెల్లి శ్రీ కాంత్(35) ఓ ప్రైవేటు దవాఖానలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య కుమారుడున్నారు. ఈ నెల 6న మంచిర్యాలలో బైకుపై రోడ్డు దాటుతుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను మెరుగైన వైద్యం కోసం ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానలో చేర్పించారు. మూడు రోజుల పాటు చికిత్స అందించినప్పటికీ అతడి ఆరోగ్యం మెరుగుపడలేదు. ఈ నెల 8న శ్రీకాంత్‌కు బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. విషయాన్ని తెలుసుకున్న జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్ కుటుంబ సభ్యులను కలుసుకుని అవయవదానంపై అవగాహన కల్పించారు. అందుకు బాధిత కుటుంబ సభ్యులు బ్రెయిన్ డెడ్ అయిన శ్రీకాంత్ అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. శ్రీకాంత్‌కు చెందిన రెండు కిడ్నీలు, లివర్, లంగ్స్, గుండె, రెండు కార్నియాలను దానం చేశారు.

గ్రేటర్‌ను స్వచ్ఛ- పచ్చదనంగా తీర్చిదిద్దుదాం

- బృహత్తర ప్రణాళికలో అంతా భాగస్వామ్యం కావాలి
- 50 లక్షల మొక్కల నాటు లక్ష్యంలో ఇప్పటికే 13 లక్షలు నాటాం
- పరిశుభ్రతతోనే దోమల వ్యాప్తిని నియంత్రించొచ్చు
- మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ పిలుపు

మొక్క నాటిన మేయర్, కమిషనర్ ఆమ్రపాలి, ఎమ్మెల్యే మజీద్, చిత్రంలో తదితరులు

సిటీబ్యూరో, ఆగస్టు 9(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌ను స్వచ్ఛ, పచ్చ నగరంగా మార్చాలన్న ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని, అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాసబ్ ట్యాంక్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట, నాంపల్లి ఎమ్మెల్యే మజీద్ హుస్సేన్‌లు పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మేయర్ చెప్పారు. కాలుష్య రహిత సమాజానికి పాటు పడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో గడిచిన ఐదు రోజుల పాటు అన్ని వర్గాల ప్రజలకు పరిశుభ్రత, పచ్చదనంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించామని తెలిపారు. నగరంలోని అన్ని కాలనీలలో, గార్బేజ్ పాయింట్లలో గార్బేజిని, సీ అండ్ డీ వేస్ట్‌ను క్లీన్ చేయడం జరిగిందన్నారు. ప్రధానంగా నగరంలో ఈ సంవత్సరం 50 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 13 లక్షల మొక్కలు నాటడం పూర్తయ్యిందని తెలిపారు. ప్రతి ఒక్కరు కాలుష్య రహిత సమాజానికి పాటుపడాలని డిప్యూటీ మేయర్ కోరారు. ఆరోగ్యకర జీవనానికి పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ, మొక్కలు నాటాలన్నారు.

పరిశుభ్రత, పచ్చదనం అవశ్యం: కమిషనర్

నగరాన్ని పరిశుభ్ర, స్వచ్ఛ నగరంగా అభివృద్ధి చేసుకోవడం అందరి సామాజిక బాధ్యతని కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. గ్రేటర్ వ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటాలన్నారు. చెట్లను రక్షిస్తే చెట్లు మనని రక్షిస్తాయని పేర్కొన్నారు. పరిశుభ్రతతోనే దోమలను నివారించవచ్చని, దోమలతో వ్యాప్తి చెందే వ్యాధులను నియంత్రించగలుగుతామని తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా గ్రేటర్‌లో 38 లోకేషన్స్‌లో ప్రజా ప్రతినిధుల సహకారంతో మొక్కలు నాటినట్లు ప్రజలకు అవసరమైన మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఇప్పటి వరకు, సుమారు 5.5 లక్షల మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. వన మహోత్సవం సందర్భంగా 38 లోకేషన్స్‌లో సుమారు 15 వేల మొక్కలు నాటినట్లు కమిషనర్ ఆమ్రపాలి కాట పేర్కొన్నారు. అంతకు ముందు కళాశాల ఆవరణలో మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, నాంపల్లి శాసన సభ్యులు మొక్కలు నాటారు. అధికారులు, విద్యార్థులు, కార్పొరేటర్లు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులు, కాలనీ వాసులకు ఈ సందర్భంగా మొక్కలను పంపిణీ చేశారు.

నాలాల్లో దోమల బ్రీడింగ్‌ను అరికట్టండి: ఆమ్రపాలి

గ్రేటర్‌లో వరద నీటి కాలువల్లో నీరు నేరుగా పోయే విధంగా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఉన్నతాధికారులను ఆదేశించారు. నాలాలో అక్కడక్కడ నీటి నిలువతో దోమలు బ్రీడింగ్‌కు అవకాశం ఉన్నందున వెంటనే ఆయా ప్రాంతాలలో దోమలు వ్యాప్తి చెందకుండా పూడికతీత చేపట్టాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ జోనల్, అడిషనల్ కమిషనర్లతో శుక్రవారం ఉదయం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. స్మార్ట్ వాటర్ డ్రైన్, మూసీ నదిలో వరద నీరు నేరుగా వెళ్లలేకపోవడంతో స్టార్మ్ వాటర్ డ్రైన్ అయి దోమలు బ్రీడింగ్ ఎక్కువగా అవుతున్నాయని, వెంటనే వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. సీఆర్ఎంపీ ద్వారా చేపట్టిన బీటీ రోడ్ల నిర్వహణ త్వరలో అగ్రిమెంట్ పూర్తి కావస్తున్న నేపథ్యంలో వారు ఇంకా మిగిలిన పనులు చేయలసిన వెంటనే పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్లకు ఆదేశించారు. పుట్‌పాత్‌లో సెంట్రల్ మీడియన్, కర్బ్‌లైన్, లైన్‌మార్కింగ్ పనులను అన్ని జోనల్‌లో పూర్తి చేయాలని కమిషనర్ జోనల్ కమిషనర్లను కమిషనర్ ఆదేశించారు.

స్వచ్ఛ ఇబ్బందులపై ఫిర్యాదు

సిటీబ్యూరో, ఆగస్టు 9(నమస్తే తెలంగాణ): స్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని స్వచ్ఛ ఆటో సంఘాల నేతలు జీహెచ్ఎంసీ కమిషనర్ కాట ఆమ్రపాలిని శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. రాంకీతో తమకు ఇబ్బందులు వస్తున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. జీహెచ్ఎంసీనే నమ్ముకుని బతుకుతున్న కార్మికులను గుర్తించాలని, సెకండరీ పాయింట్స్ వద్ద స్వచ్ఛ ఆటోలు పడుతున్న ఇబ్బందులను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆటో ప్రెసిడెంట్ రాజేందర్ పాల్గొన్నారు.

జిల్లా వార్షిక క్రెడిట్ ప్లాన్ రూ.3,16,795.55 కోట్లు

వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

- వెల్లడించిన హైదరాబాద్ కలెక్టర్
- విద్యా రుణాలు విరివిగా అందించాలి

సిటీబ్యూరో, ఆగస్టు 9(నమస్తే తెలంగాణ): ఈ ఏడాది 2024-25 ఆర్థిక సంవత్సరానికి హైదరాబాద్ జిల్లా వార్షిక క్రెడిట్ ప్లాన్ రూ.3,16,795.55 కోట్లుగా నిర్ణయించినట్లు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రాధాన్యతా రంగాలలో విద్యా రుణాలు విరివిగా అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన డీసీసీ/డీఎల్ఆర్సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో విద్యా రుణాలు రూ.1108.88 కోట్లు లక్ష్యం కాగా, రూ.30.38 కోట్లు మాత్రమే అందించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకులు తక్షణమే నిరుపేదలకు విద్యా రుణాలు అందించాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లా వార్షిక క్రెడిట్ ప్లాన్‌లో ప్రాధాన్యతా రంగం లక్ష్యం రూ.65736.59 కోట్లు కాగా, జూన్ 2024 నాటికి రూ.40610.60 కోట్లు సాధించడం జరిగిందన్నారు. నాన్ ప్రయారిటీ రంగం లక్ష్యం రూ.251059.04 కోట్లు లక్ష్యం కాగా, రూ.102943.66 కోట్లు సాధించడం జరిగిందని తెలిపారు. చిన్న, సూక్ష్మ, మధ్యతరగతి పరిశ్రమలకు రూ.59758.43 కోట్లు రుణాలు లక్ష్యం కాగా, జూన్ 2024 నాటికి రూ.32878.25 కోట్లు లక్ష్యం సాధించడం జరిగిందన్నారు. బ్యాంకులు నెలవారీగా లక్ష్యం నిర్దేశించుకుని రుణాలను అందించాలని కలెక్టర్ చెప్పారు. స్వానిధి ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సకాలంలో రుణాలు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ ఏజీఎం రహమాన్, నాబార్డ్ డీడీఎం హర్ష రఘురాం, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఫార్మా రంగానికి ప్రపంచ స్థాయిలో ఉజ్వల భవిష్యత్

నైఫర్ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ సత్యనారాయణ చావా

జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నైఫర్ ప్రతినిధులు

బాలానగర్, ఆగస్టు 9: ఫార్మా రంగానికి ప్రపంచస్థాయిలో ఉజ్వల భవిష్యత్ ఉందని నైఫర్ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ సత్యనారాయణ చావా అన్నారు. శుక్రవారం బాలానగర్ పారిశ్రామికవాడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైఫర్)లో నైఫర్ డైరెక్టర్ శైలేంద్ర సరాఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ డ్రగ్ డిస్కవరీ, డెలివరీ డయగ్నోస్టిక్స్ 2024 (ఐసీడీ4-2024) సదస్సుకు నైఫర్ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ సత్యనారాయణ చావా, నైఏబీ డైరక్టర్ డాక్టర్ జీ తరు శర్మ, బీఐఎంఏఐ జాతీయ అధ్యక్షుడు ఆర్‌కే అగర్వాల్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి శైలేంద్ర సరాఫ్ స్వాగతం పలికారు. సంస్థ ప్రాంగణంలో డ్రగ్ డిస్కవరీ, డెలివరీ డయగ్నోస్టిక్స్ 2024 సదస్సును పురస్కరించుకొని పలు ఫార్మా రంగ విద్యార్థులు, నిపుణులు, పలు స్టార్ట్స్ ఏర్పాటు చేశారు. ఆయా స్టార్ట్స్‌ను పలువురు పరిశోధకులు, ఫార్మా రంగ ప్రతినిధులు చూసి నివ్వెరపోయారు. అనంతరం, నైఫర్ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ సత్యనారాయణ చావా మాట్లాడుతూ, 2023వ సంవత్సరంలో ఎన్ ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో దేశంలోనే నంబర్ వన్ ఫార్మసీ సంస్థగా నైఫర్ నిలువడం హర్షణీయం అన్నారు. నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతూ నైఫర్ ఫార్మా రంగంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకుంటుందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలలో నైఫర్‌లు సేవలందిస్తున్నప్పటికీ ర్యాంకింగ్‌లో నైఫర్ హైదరాబాద్ ముందు వరుసలో నిలువడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో ఫార్మా పరిశోధకులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమల నిపుణులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 200 మంది ఫార్మా విద్యార్థులు హాజరయ్యారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

రెమిడియం థెరప్యూటిక్ సీఈఓ పాట్ కృష్ణన్

సిటీబ్యూరో, ఆగస్టు 9(నమస్తే తెలంగాణ): ఆయుర్వేదంతో సంపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని రెమిడియం థెరప్యూటిక్స్ సీఈఓ పాట్ కృష్ణన్ తెలిపారు. ఆయుర్వేదం పనితీరుపై పాట్ కృష్ణన్ తన అభిప్రాయాన్ని వర్చువల్ సమావేశంలో వెల్లడించారు. తేలికపాటి, మితమైన కొవిడ్-19 చికిత్సలో కోరోక్విల్-జడ్ఎన్ యాడ్ ఆన్ థెరపి సమగ్రంగా పనిచేస్తుందని, ఈ విషయాన్ని ఆయుష్ మంత్రిత్వ శాఖ కూడా ఆమోదించినట్లు తెలిపారు. కొవిడ్ అనేది ప్రధానంగా ఊపిరితిత్తులు, రక్తనాలాలు తదితరాలపై ప్రభావం చూపుతుందన్నారు. కోరోక్విల్ – జడ్ఎన్ యాడ్ థెరపి అనేది రోగ నిరోధక శక్తిని పెంచడంతో పాటు వ్యాధి చికిత్సకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.

శ్రీచైతన్యలో గురుకుల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

- అత్యుత్తమ సంస్థల నుంచి 213 మంది బోధన నిపుణుల ఎంపిక
- అకాడమిక్ డైరెక్టర్ సుష్మ

సిటీబ్యూరో, ఆగస్టు 9(నమస్తే తెలంగాణ): దేశంలో ప్రముఖ విద్యా సంస్థలుగా పేరున్న శ్రీచైతన్య విద్యా సంస్థలు ఇటీవల నిర్వహించిన గురుకుల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా ఐఐటీ, ఎన్ఐటీ, ఇతర ప్రఖ్యాత విద్యా సంస్థల నుంచి 213 మంది నిపుణులను నియమించినట్లు సంస్థ అకాడమిక్ డైరెక్టర్ సుష్మ వెల్లడించారు. తమ సంస్థలో పనిచేసే కొత్త ఫ్యాకల్టీ సభ్యులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం వల్ల జేఈఈ, నీట్, ఐఏఎస్ వంటి పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉత్తమ విద్యా శిక్షను అందించేందుకు వారిని సిద్ధం చేశామన్నారు. గురుకుల్ రిక్రూట్‌మెంట్ ద్వారా భారతదేశంలోని అత్యుత్తమ విద్యావేత్తలను ఎంపిక చేసేందుకు మేం ఎంతో గర్వపడుతున్నామని ఆమె తెలిపారు. ఇది మన విద్యా వ్యవస్థకు నూతన ఉత్సాహాన్ని, ప్రేరణ అందిస్తుందని అభిప్రాయపడ్డారు.

పక్కాగా భూముల సర్వే నిర్వహించాలి

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి: కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, ఆగస్టు9:మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు భూముల సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు రెవెన్యూ అధికారులకు సూచించారు. సర్వే చేసిన భూములను కేఎంఎల్ మ్యాప్‌లో పొందుపర్చాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి రెవెన్యూ అధికారులతో జిల్లాలోని భూముల సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు కచ్చితమైన ప్రమాణాలతో సర్వే చేయాలన్నారు. నిషేధిత భూములు, రక్షణ శాఖ, అటవీ శాఖ, సీలింగ్ భూములు, అసైన్డ్ భూములను ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే చేయాలన్నారు. ఆ భూములను వివరాలను సాంకేతికంగా కీ హోల్ మార్కప్ లాంగ్వేజ్(కేఎంఎల్) మ్యాప్(గుగూల్)లో పొందుపర్చాలన్నారు. ఎల్ఆర్ఎస్‌లో భాగంగా లేఔట్ల క్రమబద్ధీకరణ, భవన నిర్మాణ అనుమతులకు టీజీఐ పాస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి కేఎంల్ మ్యాప్‌లో సూచించిన భూముల వివరాల ప్రకారం, అనుమతులు జారీ చేసేందుకు సులభతరం అవుతుందన్నారు. భూముల వివరాలను మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో శాశ్వత రికార్డులుగా సిద్ధం చేసి, భద్రపర్చాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులకు సూచించారు. రక్షణ శాఖ, అటవీ శాఖ భూములు సంబంధించిన సరిహద్దులను కూడా గుర్తించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు, తాసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు

బస్తీ దవాఖానలో తమిళ నాడు వైద్య సిబ్బంది

ముత్యాలబాగ్ బస్తీ దవాఖానలో వైద్య సేవలు తెలుసుకుంటున్న తమిళనాడు వైద్య అధికారులు

హిమాయత్‌నగర్, ఆగస్టు 9: పట్టణాల నుంచి పల్లెల వరకు పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసింది. హైదర్‌గూడ, ముత్యాల బాగ్‌లో ఉన్న బస్తీ దవాఖానను తమిళనాడు రాష్ట్ర వైద్య విభాగం అధికారుల బృందం శుక్రవారం సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డిజిటల్ సర్వీసెస్, ఆయుష్మాన్ భారత ఆరోగ్యశ్రీ, ఆరోగ్య మహిళా తదితర పథకాలతో పాటు ఓపీ కన్సల్టేషన్స్, తెలంగాణ డయగ్నస్టిక్స్ సర్వీసు పనితీరును తెలుసుకున్నారు. బస్తీ దవాఖానల్లో పేదలకు వైద్యం అందిస్తున్నామని, ఉచితంగానే మందులను పంపిణీ చేస్తున్నామని బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్రుతి తమిళనాడు వైద్య బృందానికి వివరించారు. వారి వెంట హెల్త్ విభాగం జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఏస్పీహెచ్‌వో డాక్టర్ సాయిబాబా, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రుక్మా రెడ్డి ఉన్నారు.

కొంపల్లిలో క్రెడాయ్ ప్రాపర్టీ షో షురూ..

11వ తేదీ వరకు కొనసాగనున్న రియల్ ప్రదర్శన



మూడు రోజుల పాటు జరిగే క్రెడాయ్ ప్రాపర్టీషోను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 9: దేశంలోని ప్రైవేట్ రియల్ ఎస్టేట్ డెవలపర్ల అత్యున్నతమైన సంస్థ క్రెడాయ్ (కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో కొంపల్లిలో శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల ప్రాపర్టీ షోను శుక్రవారం ప్రారంభించారు. ఈ షోలో బాలానగర్, కొంపల్లి, శామీర్‌పేట్, మేడ్చల్, అల్వాల్, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లు, విల్లాలు, ప్లాట్లు కమర్షియల్ స్పేస్‌లతో కూడిన అత్యుత్తమ ప్రాజెక్ట్‌లు ఒకే గొడుగు కింద ప్రదర్శించారు. ఈ సందర్భంగా క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్‌లో రియల్ రంగం అభివృద్ధి పైపునకు పరుగులు పెడుతున్నదన్నారు. గతంలో పోల్చుకుంటే రాబోయే రోజుల్లో మరింత విస్తరించేందుకు ఆస్కారం ఉన్నదని, ఎస్ఆర్‌డీపీ కింద కొత్త రేడియల్ రోడ్ల నిర్మాణం, మెట్రో, ఎంఎంటీఎస్ నెట్‌వర్క్‌లను విస్తరించడం చివరి మైలు కనెక్టివిటీని మెరుగుపర్చేందుకు రవాణా కారిడార్ల కోసం ప్రణాళికల వంటి ప్రతిష్టాత్మకమైన మౌలిక సదుపాయాల కల్పనలు విస్తరణ జరుగుతుందన్నారు. ప్రపంచ దేశాలు నగరం వైపునకు చూసేలా ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో రియల్ రంగం మరింత పుంజుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. క్రెడాయ్ హైదరాబాద్ ఎలెక్ట్ ప్రెసిడెంట్ ఎన్.జైదీప్ రెడ్డి, కార్యదర్శి బి.జగన్నాథరావులు మాట్లాడుతూ, క్రెడాయబిలిటి ప్రాపర్టీ షో ఆగస్టు 9 నుంచి 11 వరకు ఉత్తర హైదరాబాద్‌లో జరుగుతున్నదన్నారు. కొనుగోలుదారుల అంచనాలకు అనుగుణంగా, ప్రీమియం హౌసింగ్ స్మార్ట్ హోమ్ టెక్నాలజీలు, పర్యావరణ అనుకూల అవకాశాలను పొందుపర్చామన్నారు. ఇలాంటి అవకాశాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలకు చెందిన భవన నిర్మాణాలు, నూతన మార్పులకు అనుగుణంగా తీర్చిదిద్దబడిన వివిధ రకాల నిర్మాణాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వినియోగదారులు సందర్శించి అమితాసక్తిని చూపారు.

పుట్టుకతో వచ్చే జబ్బులు పేదల భవితకు అడ్డు కారాదు

టీ హబ్‌లో 'నాన్వీ దిలో - కా సఫర్' ముగింపు వేడుక

టీ-హబ్‌లో నాన్వీ దిలో - కా సఫర్' కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

కొండాపూర్, ఆగస్టు 9: పుట్టుకతో వచ్చే గుండె జబ్బులకు సంబంధించి పేద పిల్లలకు చికిత్స చేయడానికి కేర్ హాస్పిటల్, కోనెక్సస్, జగతి ఫౌండేషన్‌లతో కలిసి సీఎస్సార్ ద్వారా కొనసాగిస్తున్న 'నాన్వీ దిలో-కా సఫర్' ముగింపు వేడుకను నాలెజ్జ్ సిటీలోని టీ-హబ్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేర్ హాస్పిటల్స్ గ్రూపు సీఈఓ జస్దీప్ సింగ్, టీ హబ్ సీఈఓ శ్రీనివాసరావు మహంకాళిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పుట్టుకతో వచ్చే గుండె జబ్బులతో పేద పిల్లల భవిష్యత్తుకు అడ్డంకి కాకూడదని, వారికి అందమైన భవిష్యత్తును అందించేందుకు సీఎస్సార్ ద్వారా మెరుగైన చికిత్సను అందించడం అభినందనీయమన్నారు. దీంతో పాటు ప్రజలకు పుట్టుకతో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేర్ హాస్పిటల్స్ కార్డియో థొరాసిక్ సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ తపన్ కుమార్‌దాస్, వైద్యులు, ఎన్జీవో భాగస్వాములు, వాలంటీర్లు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హాస్టళ్లల్లోనూ ఆపరిశుభ్రత !

నిబంధనలు పాటించని వారిపై ఫుడ్ సేఫ్టీ చర్యలు

నగరంలోని ఓ హోటల్ ముందు ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు

సిటీబ్యూరో, ఆగస్టు 9(నమస్తే తెలంగాణ): ఆహారప్రియులు జర జాగ్రత్త! గ్రేటర్ రెస్టారెంట్లు, హోటళ్లు, బార్లు, హాస్టళ్లలో మీరు లొట్టలేసుకుంటూ లాగించే ఆహార పదార్థాలు వారాల కొద్దీ నిలువ